# గవర్నమెంట్ పేషెంట్

పల్లవి

"అమ్మా! నాకు ఉద్యోగం వచ్చిందే!" అంటూ పరుగులాంటి నడకతో వంటగదికెళ్ళి పేపర్ చూపించింది డాక్టర్ పావని.

"నీకు రాకుంటే ఇంకెవరికి వస్తుందే. ఏ ఊరికి వేసారు? జీతం ఎంతిస్తారు? అల్లుడికి నీ నెంబర్ తెలుసా?" అంటూ సందేహాలు వెలిబుచ్చింది ఐదవ తరగతితో చదువు చాలించిన పావని తల్లి పార్వతమ్మ.

"ఆ! తెలుసు! అయినా నా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఇంకా ఆరునెలలుంది కదే! పోస్టింగ్ ఆర్డర్స్ ఆలస్యంగా వస్తేనే బాగుంటుంది" అంటూ అప్పుడే తను అసిస్టెంట్ సివిల్ సర్జన్ అయి టీచింగ్ హాస్పిటల్‌లో తిరిగేటట్లు ఊహించుకుంది పావని.

"ఏమండోయ్! వింటున్నారా! అమ్మాయికి ఉద్యోగం వచ్చిందట! ఉత్తర దక్షిణాలు లేకుండా ఏమీ జరగవంటారుగా! మరి ఇప్పుడేమంటారు? మన అమ్మాయి అదృష్టవంతురాలండీ! ఎవరి ప్రమేయం లేకుండానే అన్నీ సవ్యంగా జరిగిపోతున్నాయి" అంటూ భర్త పరంధామయ్యకు కాఫీ కప్పు అందించింది పార్వతమ్మ.

"ఆ! అప్పుడే సంబరపడిపోకే! ఏ పల్లెటూర్లో వేస్తారో? ఏమో?! అయినా అది ఇంత కష్టపడి చదివిన చదువుకు వాళ్ళిచ్చే జీతానికి పొత్తులేదే! మన రామారావు గ్రేడు.... అదేనే ఫీ పిన్ని కొడుకు హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాడు కదా, వారి జీతం డాక్టర్ల జీతం ఒకటే! అయినా దానికి ఊద్యోగం ఎందుకే! హాయిగా మన ఊళ్లోనే ప్రాక్టీస్ పెట్టుకుంటే కావలసినంత డబ్బు వస్తుంది, పేరూ వస్తుంది. వెధవ ప్రభుత్వ ఉద్యోగం!" అంటూ తన కసినంతా ఆ ఒక్కమాటలోనే వెలిబుచ్చాడు. ప్రభుత్వ ఉద్యోగిగా రిటైరయిన యాభైఆరేళ్ళ పరంధామయ్య.

అకస్మాత్తుగా యాభై అయిదేళ్ళకే రిటైరయిన ఉద్యోగస్తులలో ఈయన ఒకరు. ప్రతిరోజు ప్రభుత్వాన్ని తిట్టడం ఆయన దినచర్యలలో ఒకటి. కష్టపడి చదివి సర్వీస్ కమీషన్‌కి మొదటిసారిగా హాజరయి ఉద్యోగం వస్తుందని ఆశపడ్డ పావనికి నిరాశే ఎదురయింది. కాని ఏమీ చదవకుండా ఊరికే అలా వ్రాస్తే ఇలా ఉద్యోగం వస్తే నిజంగానే ఆశ్చర్యపోయింది ఈసారి. అయినా ప్రస్తుత కర్తవ్యం యం.డి పాస్ అవ్వడం అని మనస్సులో అనుకుని. హైదరాబాదుకు ప్రయాణమయింది.

ప్రొద్దుటే నీట్‌గా తయారయి, వార్డులోనికి అడుగుపెట్టిన పావనికి మరో ఆశ్చర్యకరమైన వార్త అందినది. వాళ్ళ ప్రొఫెసర్ డా. రేణుకాదేవి ట్రాన్స్‌ఫర్ అయినట్లు! ప్రతి ఉద్యోగస్తుడికి అది మామూలయినా వాళ్ళ మేడమ్ విషయంలో మాత్రం అది చాలా అన్యాయమనిపించింది.

నేటి పోటీ సమాజంలో డబ్బు, హోదాకు విలువనిచ్చి చికిత్స చేసే డాక్టర్ల కోవకు చెందని మనిషి ఆమె! డా. రేణుకాదేవి ఎక్కువగా మాట్లాడదు. అయినా ఆమె ప్రవర్తన, డబ్బునుబట్టి కాకుండా రోగాన్ని బట్టి రోగికి ఇచ్చే విలువ చాలా అమూల్యమైనది.

పావని వాళ్ళ టీచింగ్ కూడా డా. రేణుకాదేవి వచ్చిన తరువాత చాలా మెరుగైంది. పుస్తకాలలో ఇచ్చింది కాకుండా రోగుల ద్వారా చదువు నేర్చుకోమనేది. మనుషులను మంచి మార్గంలో నడిపించడానికి అలాంటి వ్యక్తులు వెయ్యికి ఒకరున్నా చాలనుకునేవాళ్లు. మరి అలాంటి. మనిషిని అన్ని నిబంధనలకు వ్యతిరేకంగా ఎందుకు బదిలీ చేసినట్లు? అర్థంకాని ప్రశ్నగానే మిగిలిపోయింది పావనికి.

రకరకాల కథలు ప్రచారం లోనికివచ్చాయి.అతితక్కువ కాలంలో ఎన్నో మంచి పనులుచేసి ఇన్‌స్టిట్యూట్‌కే పేరు తెచ్చిన మనిషి నవ్వుతూ వీడ్కోలు తీసుకుంది. పలుకుబడిగల వ్యక్తి ఆమె స్థానం ఆక్రమించుకోవడానికి పన్నిన పన్నాగమని చివరకు తెలిసింది. మనిషి ప్రజ్ఞనుబట్టి కాకుండా పలుకుబడికి విలువనిచ్చే ప్రభుత్వాన్ని ప్రజలే మార్చాలి అనుకుంది పావని.

కాలం ఎవరికోసమూ ఆగదు! క్రొత్త ప్రొఫెసర్ రావడమూ, పావని పాస్ అవడము, భర్తతో హైదరాబాదులో కాపురం పెట్టడమూ జరిగిపోయాయి. సర్వీస్ కమీషన్ ఫలితాలు వచ్చిన ఎనిమిది నెలలకు పోస్టింగ్ ఆర్డర్స్ వచ్చాయి పావనికి. ఆ ఆర్డర్ చూసిన పావనికి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. పసిడికొండ పి.హెచ్.సి ఆదిలాబాదు జిల్లా అని ఉంది.

జాయిన్ అవ్వడానికి అరవయి రోజుల వ్యవధి ఇచ్చారు.

తాను యం.డి పాస్ అయ్యింది కదా! మరి అనుభవం రావడానికి పెద్ద హాస్పిటల్స్‌లోనే నేర్చుకోవాలి. మరి తను పల్లెటూరికి పోయి ఏం చేస్తుందని! ఆలోచించి తనతో యం.డి పాసయిన ఇద్దరు స్నేహితులను తీసుకొని డైరెక్టర్‌ను కలుసుకుందామనుకున్నారు. మొదటిసారిగా ఆయన ఇంటర్‌వ్యూ ఇవ్వనన్నాడు. అయ్యో ఇదేం న్యాయం? రేడియో, టి.వీ వాళ్ళకు తప్ప మిగతా వారికి ఇంటర్‌వ్యూ ఇవ్వడేమోనని రెండవసారి ప్రయత్నిస్తే ఆయన దర్శనభాగ్యం దొరికిందా యువడాక్టర్లకు.

"మేము యం.డి పాస్ అయ్యాము కాబట్టి మాకు టీచింగ్ పోస్ట్ ఇవ్వండి" అంటూ అడిగింది పావని. దానికి ఆ డైరెక్టర్ యమధర్మరాజులా ఠీవిగా పోజుపెట్టి.

"అయ్యో! మీకిది తెలియదా? మీ పోస్ట్‌లన్నీ రూరల్ సర్వీసు కొరకు. మేము మీ పోస్ట్‌లను సరండర్ చేస్తే తప్ప మీరు టీచింగ్ సైడుపోవడానికి వీలులేదు. కాని మేము మీ పోస్ట్‌లను సరండర్ చేయమని" చావుకబురు చల్లగా చెప్పాడు.

"అయ్యో! స్వర్గం అనుకొని తెలియకుండానే నరకానికి నడిచి వచ్చాము!" అనుకొని ఇళ్ళు చేరుకున్నారు నిస్సహాయంతో నిరుత్సాహంతో.

మళ్ళీ వెళ్ళి రిక్వెస్ట్ చేసుకుందామంటే దర్శనమివ్వడానికి ససేమిరా ఒప్పుకోలేదు ఆ డైరెక్టరు. దిక్కుతోచని పక్షుల్లా, మాకూ రెక్కలొచ్చాయి స్వయంగా ఎగురుదామని ఎగిరి క్రిందపడ్డ కాకిపిల్లల్లా ఏమీ చేయడానికి పాలుపోలేదు ఆ యువడాక్టర్లకు.

చివరకు రూరల్ పోస్టింగ్ చేయడానికి నిర్ణయించుకుంది పావని. తను యం.డి చదవలేదనుకొని, యం.బి.బి.యస్ డాక్టర్‌లాగే పనిచేద్దామనుకొని ఒక శుభముహూర్తాన ఆర్డర్స్ పట్టుకొని ఆర్.టి.ఏ వాళ్ళిచ్చిన

డాక్టర్లు గ్రామాలకు వెళ్ళడంలేదని ప్రభుత్వంలో పెద్ద మనుషులు తరచు అంటూంటారు. కానీ ఆ మారుమూల పల్లెలకి డాక్టర్లు ఎందుకు వెళ్ళడంలేదో ఎవరూ ఆలోచించరు. ప్రతిమనిషీ సుఖంగా బ్రతకాలని కోరుకోవడం సహజం. ప్రాణాలకే రక్షణలేని ప్రదేశాలలో పోస్టు చేస్తే ఎవరు మాత్రం వెళ్ళగలరు? అందునా లేడీ డాక్టర్లు వెళ్ళడానికి మరీ సాహసించాలి! అధికారం, పలుకుబడి వున్న వారిని మంచి మంచి ఊళ్ళలో నియమించి, ఎటువంటి రికమండేషనూ లేని వారిని మారుమూల పల్లెటూళ్ళలో పడేస్తూంటారు. అలాటి ఊళ్ళలో డాక్టరు నామకః వుంటుందేగాని, శారీరకంగా వుండదు. పావనిలాంటివాళ్ళు ఎందరో కనిపిస్తారు ప్రస్తుత పరిస్థితుల్లో!

'పల్లవి'



సూచనలతో ముందు జిల్లా అధికారిని కలిసి తరువాత ఆ గ్రామం చేరుకుంది అతి ప్రయాసతో!

ఆ గ్రామంలో అడుగుపెట్టిన పావనికి ఎప్పుడో నవల్లో చదివినట్లుగా కాకండా, తెలుగు సినిమాల్లో చూసిన గ్రామంలా కాకుండా ఒక ఎడారి ప్రాంతానికి దారితప్పి చేరుకున్నట్లనిపించింది. మళ్ళీ హైదరాబాదుకు అప్పుడే తిరుగు ప్రయాణమయితే బాగుంటుందనిపించింది.

అక్కడొక గుడిసె, ఇక్కడొక గుడిసె తప్ప ఒక ఊరు అని చెప్పడానికి ఆధారాలేవీ లేవక్కడ?

చిన్న బ్రీఫ్‌కేస్‌తో, గుర్తుతెలియని వ్యక్తి ఆ ఊరికి రావడం ఆ పల్లె ప్రజలకు వింతగానే ఉంది. ఉండబట్టలేక అడగనే అడిగారు, ''ఎవరమ్మా నీవు'' అని.

''ఇక్కడికి క్రొత్తగా వచ్చిన డాక్టరమ్మని'' ఏడ్వలేక చెప్పింది పావని!

'అమ్మో! ఈ అడవిలో నేను వంటరిగా ఉండగలనా? నేను చదివిన చదువుకు నేను ఇక్కడ చేసే పనులకు ఏమైనా సంబంధం ఉందా? ఎలాంటి సదుపాయాలు లేకుండా తనేం వైద్యం చేయగలదు' అనుకుంది మనస్సులో.

ప్రభుత్వం ప్రజల జీవన పరిస్థితులను పట్టించుకోకుండా, వాళ్ళకు కావలసిన కనీస అవసరాలను తీర్చకుండా ఆకలితో అలమటించే వాడిముందు క్రొత్త కలర్ టి.వీ పెట్టి చూడమన్నట్లు నన్నిక్కడ పోస్ట్‌చేసారేమిటి? అనుకుంది.

అక్కడ మనుషులను చూస్తుంటే ''దాహం దాహం'' తెలుగు సినిమా ప్రత్యక్షంగా చూస్తున్నట్లనిపించింది. ఆ సినిమాకు అవార్డ్ ఇచ్చి సత్కరించిన ప్రభుత్వం దానిలోని నీతిని మాత్రం గ్రహించలేకపోయింది. మనకు స్వతంత్రం వచ్చి ముప్పై ఎనిమిది సంవత్సరాలయినా ప్రజలకు త్రాగే నీరు అందించలేని ప్రభుత్వం

ఎందుకమకుంది పావని.

అక్కడి ప్రజల కష్టాలు విని పావని జాలిగుండె కరిగిపోయింది.

ఉండడానికి ఇల్లు లేదు.

త్రాగడానికి నీరులేదు.

కట్టుకోవడానికి బట్టలేదు.

పంటలు పండించుకోవడానికి సకాలానికి వర్షాలు లేవు. వేరే నీటి వసతిలేదు. మరి వీరికి ఎవరు ఎలా సహాయపడాలో ఇప్పుడిప్పుడే నిజజీవితంలోనికి అడుగుపెట్టిన పావనికి అర్థం కాలేదు.

అంతలోనే ఒక గర్భిణీ స్త్రీ ప్రసవవేదనతో వచ్చింది.



తాను చేసిన స్పెషలైజేషన్ అదే కాబట్టి పావని ఫరవాలేదు ఈ ఊరుకూడా బాగానే ఉందిలే అనుకుని పూర్తిగా పరీక్షించిందా కేసును.

"నీ పేరేంటమ్మా?" అనడిగింది.

"సాయమ్మ నీ బాన్ఛని" అందామె.

సాయమ్మది మొదటి కానుపు. రెండు రోజుల నుండి ప్రసవవేదన పడుతుంది. ఇంట్లో చేయలేనని ఆ ఊరి మంగలామె చెప్పిన తరువాత ఆ పి.హెచ్.సికి తీసుకొచ్చారు.

సాయమ్మ ప్రసవించడానికి దారి సరిగ్గా లేక గర్భకోశం పగిలిపోయేస్థితికి వచ్చింది. మరి అలాంటికేసును పి.హెచ్.సిలో ఏం చేస్తుంది? అందుకే దగ్గరలో ఉన్న జిల్లా హాస్పటల్‌కు రిఫర్ చేసింది. ఉన్నట్లుండి సాయమ్మ తల్లి పోలమ్మ పావని రెండు కాళ్ళు పట్టుకుంది. "అమ్మా ఎలాగయినా నీవే నా బిడ్డను బ్రతికించాలి. వచ్చి నీ కడుపున పుడతాను తల్లి" అంటూ రోదించింది పోలమ్మ.

పావనికి తన అసహాయతను వాళ్ళకు అర్థం చేసే ఓపికలేక తనవల్ల కాదని, ఆలస్యం చేస్తే ఆమె బ్రతకదని ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా వైద్య సహాయం అందాలని చెప్పింది.

ప్రభుత్వ వాహనాలన్నీ పెట్రోల్ ధర పెరిగిందని క్రొత్త ముఖ్యమంత్రి తీసేసుకున్నాడని విని 'ఇదెక్కడి పొదుపు ఉద్యమంరా భగవంతుడా' అనుకుంది.

కొద్దిసేపటికి రెండెడ్ల బండిని తీసుకొచ్చి అందులో పడుకోబెట్టారు సాయమ్మను. అతికష్టం మీద కదిలిందా బండి రోడ్డుపైకి. 'చూసారా? ఈ రాకెట్ యుగంలో కూడా మేము లేకుంటే మీ పనిసున్నా'లంటూ ఎద్దులు నడకసాగించాయి. ఆ రాత్రి నిద్రలేదు పావనికి.

తెల్లవారేసరికి అదేబండిలో ఏడ్పులతో శవంగా మారిన సాయమ్మను తీసుకొని వచ్చారు. అంటే సకాలంలో వైద్యం లేక మరణించిన సాయమ్మను తలచుకుంటే పావనికి కడుపులో దేవినట్లయింది.

తను ఇంత చదువు చదువుకొని అదే సబ్‌జెక్ట్‌లో

ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక
మరో సరికొత్త ప్రయోగం

# ఏడుపు (గొట్టు) కథల పోటీ

ఏడుపు ఏడు రకాలు: *1.* బాగాలేని కథ చదివినప్పుడు ఏడుపొస్తుంది. *2.* బాగున్న నవల హృదయాన్ని కదిలించినప్పుడు ఏడుపొస్తుంది. *3.* తోటికోడలు నవ్వినందుకు (మొగుడు కొట్టినందుకు కాదు) ఏడుపొస్తుంది. *4.* ఆత్మీయులు దూరమైనప్పుడు. *5.* ఇష్టం లేనివాళ్లు దగ్గర కొచ్చినప్పుడు. *6.* ఆంధ్రభూమి సమయానికి రాక పోయినప్పుడు. *7.* పక్కవాడు బాగుపడినపుడు... ఇలా ఏడుపు ఏడు రకాలు.

ఈ ఏడుపును దృష్టిలో పెట్టుకుని ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక ఏడుపు (గొట్టు) కథల కాంపిటీషన్ ఏర్పాటు చేస్తున్నదని తెలియజేయడానికి ఎంతో సంతోషిస్తున్నాము.

ఏడుపు (గొట్టు) కథల్లో ఏడింటికి బహుమతులు లభిస్తాయి.

*** మొదటి బహుమతి ***

మూడు వందల ఏడు రూపాయలు (300 + 7)

*** రెండవ బహుమతి ***

రెండువందల ఏడు రూపాయలు (200 + 7)

*** మూడవ బహుమతి ***

నూట ఏడు రూపాయలు (100 + 7)

*** నాలుగు కన్సొలేషన్ (కంటి తుడుపు) బహుమతులు ***

ఒక్కొక్కటీ ఏభై ఏడు రూపాయలు (50+7)

## పోటీకి నియమ నిబంధనలు

* కథలు రెండు అరఠావు పేజీలకు మించరాదు.
* కాగితానికి ఒక వైపునే పెన్‌తో రాయాలి.
* పోటీకి పంపే రచన మీద, కవరు మీద 'ఏడుపు (గొట్టు) కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి.
* ప్రచురణకు స్వీకరించని కథలను తిప్పి పంపాలంటే తగిన స్టాంపులు అంటించిన కవరు తప్పని సరిగా జతచేయాలి.
* కథల ఎన్నిక విషయంలో తుది నిర్ణయం ఎడిటర్‌దే. దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.
* ప్రతి కథ చివరా రచన సొంతమేననీ, ప్రసారం కాని ప్రచురణకాని కాలేదని హామీ వుండాలి.
* కథలు—ఎడిటర్, ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 36, సరోజినీ దేవి రోడ్, సికిందరాబాద్ – 500 003 అనే చిరునామాకు పంపాలి.

**పోటీ కథలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ జూన్ 17**



### పరీక్ష

పరీక్షలు జరుగుతున్నాయి

"ఏయ్ మిస్టర్! పక్కతని ఆన్సర్ పేపర్ చూసి రాస్తున్నావు. జాగ్రత్త" హెచ్చరించాడు వాచర్ రమేష్‌ని

"అబ్బే లేదు సార్. అతను కరెక్టుగా వ్రాసాడో లేదో అని చూస్తున్ననంతే" చెప్పాడు రమేష్.

—కొమ్మినేని ప్రసాద్ (గుంటూరు)

స్పెషలైజ్ చేసికూడా ఆ స్త్రీని బ్రతికించలేక పోయానే అని బాధపడింది. ఈ చావుకు కారణం మాత్రం తను కాదు అనుకొని, రవాణా సౌకర్యాలు తగిన వసతులు లేని వైద్యశాలలే కారణమనిపించింది, పరిష్కారమార్గం కన్పించలేదు.

"అమ్మా! అయిపోయింది తల్లీ! అంతా అయిపోయింది. నా బిడ్డకు అప్పుడే నూరేళ్ళునిండాయి" అంటూ పావని దగ్గరకు వచ్చింది పోలమ్మ.

"ఏం జరిగింది పోలమ్మా! ఎలా చనిపోయింది. అక్కడికి చేరుకోవడం ఆలస్యం అయ్యిందా" అనడిగింది పావని.

"ఏం చెప్పను తల్లీ! దీని రోగాన్ని చదివిన డాక్టరు ఆ దవాఖానలో లేడట! మిగతా వాళ్ళు తమరన్నట్లే తమవల్ల కాదన్నారమ్మా! కళ్ళముందే నా బిడ్డ చస్తుంటే చూస్తూ నిలబడ్డారు తల్లీ" అంటూ డాక్టర్లను తిట్టసాగింది.

పావనికి క్షణంసేపు భయమేసింది. ఆ కోపంలో తనను ఏమైనా చేస్తారేమోననుకుంది. కాని అలాంటిదేమీ జరగలేదు. ఏడ్పులతో తిట్లతో ఆ బండి గ్రామం వైపు బయలుదేరింది.

ఇంత చదువుకున్న తనని ఈ పల్లెటూరిలో వేసి తనకన్నా తక్కువ చదివిన వారిని పెద్దపెద్ద హాస్పిటల్స్‌లో ఉంచిన ప్రభుత్వ వైఖరిని ఎలా మార్చాలో అర్థం కాలేదు పావనికి. పేపర్లలో, వార్తలలో ఆరోగ్యమంత్రి మాత్రం పల్లెపల్లెకూ డాక్టర్లను నియమించామని ఎక్కడి వారికి అక్కడే వైద్యసహాయం అందుతుందని లేని కాలర్ ఎత్తుకొని ఉపన్యాసాలు ఇస్తూ, తిరిగి మళ్ళీ ఎలక్షన్స్‌లో తమ ప్రభుత్వమే అధికారానికి రావాలని పడే పాట్లనుచూస్తే, ఇవా మన ప్రజాస్వామ్య పద్ధతులు అనుకుంది పావని.

ఏ వసతులు లేని ఆ పల్లెలో ఒంటరితనాన్ని భరించలేక ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసింది పావని. *